ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు

విశాలాంధ్ర - కోటబొమ్మాళి: మండలంలోగల ప్రభుత్వ జూనియర్ కళాశాల, వంశధార జూనియర్ కళాశాలలో మొదటి సంవత్సరం ఇంటర్మీడిట్ పరీక్షలు బుధవారం ప్రశాంతంగా జరిగాయి. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 183 మంది విద్యార్థులు మొదటి ఇంటర్ పరీక్ష రాయాల్సి ఉండగా ఐదురుగు గైరహాజరు అయ్యారని చిఫ్‌సూపరెండెంట్ ఎం. ఇందిరాకుమారి, డీవో ఎం. జీ.రమణమూర్తిలు తెలిపారు. అలాగే వంశధార జూనియర్ కళాశాలలో 230 పరీక్షకు హాజరుకావాల్సి ఉండగా ముగ్గురు హాజరుకాలేదని చిఫ్ సూపరెండెంట్ డి.గిరిబాబు, ఎం.గోవింద్‌లు తెలిపారు. పరీక్ష కేంద్రంలో మంచినీటి సౌకర్యంతో పాటు పీహెచ్ సిబ్బంది వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. జిల్లా వృత్తివిద్యా అధికారి కె. ప్రకాష్‌రావు పరీక్ష కేంద్రాలను పరిశీలించారు.

ప్రపంచ దేశాల్లో భారత్ అగ్రగామిగా నిలవటానికి క్రీడారంగం ఒక కారణం

సంయుక్త కలెక్టర్ నవీన్

విశాలాంధ్ర-శ్రీకాకుళం: క్రీడలు చదువులో అంతర్భాగం అని దీన్ని గ్రహించి ప్రతీ ఒక్కరూ క్రీడా రంగానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని శ్రీకాకుళం సంయుక్త కలెక్టర్ ఎం. నవీన్ అన్నారు. బుధవారం నెహ్రు యువక కేంద్రం నిర్వహించిన శ్రీకాకుళం జిల్లా స్థాయి క్రీడల పోటీల్లో విజేతలకు ఆయన బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... భారత్ ప్రపంచ దేశాల్లో అగ్రగామిగా నిలవటానికి క్రీడారంగం ఒక కారణం అన్నారు. కులాలకు, ప్రాంతాలకు, మతాలకు, జాతులకు అతీతంగా క్రీడాకారులకు ప్రపంచ వ్యాప్తంగా ఎక్కడకు వెళ్లినా తగు గుర్తింపు, గౌరవం దక్కుతాయని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం క్రీడలకు మంచి ఆదరణ చూపుతుందని, ఇటీవల నిర్వహించిన ఉద్యోగ నియామకాల్లో స్పోర్ట్స్ కోటా తూచాతప్పకుండా భర్తీ చేశారని గుర్తు చేశారు.. నెహ్రు యువక కేంద్రం యువత భవిత కు భరోసా ఇచ్చే చక్కని కార్యక్రమాలు చేపట్టడం ఎంతో హర్షణీయం అని కొనియాడారు... వివిధ పోటీల్లో విజేతలకు శ్రీకాకుళం సబ్ డివిజనల్ పోలీస్ అధికారి ఎం.మహేంద్ర తో కలిసి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో భారత ప్రభుత్వం నెహ్రు యువక కేంద్రం కో.ఆర్డినేటర్ కె.వి.ఉజ్వల్, పర్యాటక శాఖ అధికారి ఎన్. నారాయణరావు, యువజన సంక్షేమ శాఖ అధికారి ప్రసాదరావు, జిల్లా క్రీడాభివృద్ధి శాఖ అధికారి ఎం.మాధురీలత, స్టార్ వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు శాసపు జోగినాయుడు, ఎస్. వై. కె.అకౌంటెంట్ డి.శ్రీనివాసరావు, సెట్‌శ్రీ ప్రతినిధులు కె.వి.రమణ, వి.అప్పలనాయుడు, వివిధ క్రీడా విభాగాల కోచ్‌లు పాల్గొన్నారు.

ప్రశాంతంగా పరీక్షలు రాయండి : కలెక్టర్

విశాలాంధ్ర-శ్రీకాకుళం: విద్యార్థిని, విద్యార్థులు ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు వ్రాయాలని జిల్లా కలెక్టర్ శ్రీకేశ్ లాఠకర్ సూచించారు. బుధవారం స్థానిక సాయి కృష్ణ కళాశాల, ఆర్. సి. ఎం ఇంగ్లీష్ మీడియం జూనియర్ కళాశాల్లో పరీక్షా కేంద్రాన్ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేసి, ఏర్పాట్ల పై ఆరా తీసి ఏర్పాట్లపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ శ్రీకేశ్ లాఠకర్ మాట్లాడుతూ ప్రతీ పరీక్ష కేంద్రంలో మౌలిక సదుపాయాలతో పాటు వేసవి దృష్ట్యా విద్యార్థినీ విద్యార్థులకు తాగునీరు సదుపాయం ఏర్పాట్లు చేయడం జరిగింద న్నారు. ప్రశ్నపత్రాల భద్రత, పరీక్ష కేంద్రాల వద్ద గట్టి బందోబస్తును ఏర్పాటు చేసినట్లు చెప్పారు. పరీక్షా కేంద్రాలలోకి ఎట్టి పరిస్థితుల్లోనూ సెల్ ఫోన్లు, అనుమతించవద్దని, సిసి కెమెరాలు ఏర్పాటు చేసి, వాటిని పర్యవేక్షణ బాధ్యతలను చేపట్టాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ ఆకస్మికంగా తనిఖీ శ్రీకాకుళం తహసీల్దార్ వెంకటరావు, విద్యాశాఖ అధికారులు పాల్గొన్నారు.

పకడ్బందీగా ఇంటర్మీడియట్ పరీక్షలు : ఎస్పీ

విశాలాంధ్ర-శ్రీకాకుళం స్పోర్ట్స్/క్రైం: పగడ్బందీగా ఇంటర్మీడియట్ పరీక్షలు నిర్వహణ నిర్వహించాలని పరీక్ష చీఫ్ సూపరిండెంట్లు, పోలీసు అధికారులను జిల్లా ఎస్పీ జి ఆర్ రాధిక ఆదేశించారు. బుధవారం నుంచి ప్రారంభమైన ఇంటర్మీడియట్ పరీక్షలు నేపథ్యంలో నగరంలో చైతన్య, విశ్వ విజేత, శాంతినికేతం, మహిళ కళాశాల పరీక్షా కేంద్రాలను జిల్లా ఎస్పీ జి ఆర్ రాధిక తనిఖీ చేశారు. ఈ క్రమంలో ముందుగా విద్యార్థులు పరీక్ష రాసి విధానాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు. పరీక్షా కేంద్రాల వద్ద వద్ద 144 సెక్షన్ అమలులో ఉన్నందున పరీక్ష కేంద్రాలు ఆవరణలో బయట వ్యక్తులు లేకుండా చర్యలు చేపట్టాలని సిబ్బందికి సూచించారు. జిరాక్స్ షాపులను తెరవడానికి అనుమతించరాదని సూచించారు. పరీక్షా కేంద్రాలవద్ద పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. జిల్లా వ్యాప్తంగా 89 కేంద్రాలలో ఇంటర్ పరీక్షలు నిర్వహిస్తున్నారు. పరీక్ష కేంద్రాలకు మొబైల్ ఫోన్లు, బ్లూటూత్ ఎలక్ట్రానిక్ వస్తువులు అనుమతించ రాదని అభ్యర్థులు క్షుణ్ణంగా తనిఖీ చేసిన పిమ్మటే కేంద్రంలోకి అనుమతించాలని జిల్లా ఎస్పీ సూచించారు. మాల్ ప్రాక్టీస్, అవకతవకులు లేకుండా పకడ్బందీగా పరీక్షలు నిర్వహించాలని చీఫ్ సూపర్డెంట్ ను ఎస్పీ ఆదేశించారు.

- **మరణించిన పోలీసు ఉద్యోగుల కుటుంబాలకు నగదు చెక్కు అందజేత...** పోలీసు శాఖలో విధులు నిర్వహిస్తు అనారోగ్యంతో మరణించిన పోలీసు ఉద్యోగుల కుటుంబ సభ్యులకు ప్రభుత్వం నుంచి మంజూరైన నగదు చెక్కులను బుధవారం జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లా ఎస్పీ జి.ఆర్.రాధిక అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ కుటుంబ సభ్యులతో మాట్లాడుతూ కుటుంబ నేపథ్యం, పిల్లలు చదువు తదితర అంశాలపై చర్చించి, మీకు మీ కుటుంబ సభ్యులకు జిల్లా పోలీసు శాఖ ఎల్లవేళల అండగా ఉంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ టి పి విఠలేశ్వర్ ఉన్నారు.

పుస్తెలతాడు చోరీ

విశాలాంధ్ర-కోటబొమ్మాళి : మండలం పాడుగుపాడు గ్రామానికి చెందిన బెండి అన్నపూర్ణ మెడలో పుస్తులతాడును గుర్తుతెలియని వ్యక్తులు చోరికి పాల్పడ్డారు. అన్నపూర్ణ మంగళవారం రాత్రి కోటబొమ్మాళిలో ఓ వివాహ విందు కార్యక్రమానికి హాజరై తిరిగి తన భర్త ద్విచక్రవాహనం పై వెలుతుండగా పొడుగుపాడు సమీపంలో గ్రానైట్ పరిశ్రమ వద్ద గుర్తు తెలియని వ్యక్తులు అడ్డంగా వచ్చి వాహనాన్ని అపి అమె మెడలో ఉన్న ఒకటిన్నర తులాల బంగారు పుస్తులతాడు తెంచి పరారయ్యారని, దీని విలువ రూ. 45లు ఉంటుందని బాదితులు పిర్యాదు మేరకు బుధవారం స్థానిక ఎస్ఐ ఎస్.కె. మహ్మద్ అలీ కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

బీఆర్ఏయూలో న్యాయ కోర్సుకు బీసీఐ గుర్తింపు

విశాలాంధ్ర-ఎచ్చర్ల : డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ యూనివర్సిటీలోని మహాత్మా జ్యోతిరావు పూలే న్యాయ కళాశాలలో మూడేళ్ల ఎల్.ఎల్.బి కోర్సుకు బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (బిసిఐ) గుర్తింపునిస్తూ ఉత్తర్వులు జారీ చేసిందనీ వీసీ ప్రొఫెసర్ నిమ్మ వెంకటరావు బుధవారం విలేకరులతో మాట్లాడుతూ వివరాలను వెల్లడించారు. యూనివర్సిటీ ఏర్పాటైన నుంచి ఎల్ఎల్‌బి కోర్సు బిసిఐ గుర్తింపు లేకుండానే కొనసాగిందని చెప్పారు. ఇప్పటివరకు వర్సిటీలో ఎల్ఎల్బి కోర్సు చదువుకుని పట్టా పొందిన విద్యార్థులకు కూడా బీసీఐ గుర్తింపు వర్కింగ్ వర్తిస్తుందన్నారు. ఈ సమస్య వర్సిటీ ఏర్పాటైన నాటినుంచి ఉన్నా అడ్మిషన్లకు ఎలాంటి ఇబ్బంది కలుగు లేదన్నారు. ప్రతి ఏటా అడ్మిషన్లకు ఎలాంటి సమస్య లేకపోవడంతో బిసిఐ అఫిలియేషన్ సమస్య ఏర్పడలేదన్నారు. గత ఏడాది నవంబర్లో బీసీఐ గుర్తింపును వర్సిటీ 8.5 లక్షల రూపాయలు చెల్లించిందని చెప్పారు. అయినప్పటికీ 2022-23 సంవత్సరంలో అడ్మిషన్లకు బిసిఐ అనుమతించ లేదన్నారు. దీంతో బీసీఐ అధికారులను, రాష్ట్ర ఉన్నత విద్యా మండలిని ఎప్పటికప్పుడు సంప్రదించడంతో వర్చువల్ విధానంలో ఈ ఏడాది ఫిబ్రవరి 3వ తేదీన బీసీఐ బృందం క్షుణ్ణంగా తనిఖీ చేసిందన్నారు. ఈనెల ఐదున బిసిఐ అధికారులు సమావేశమై అంబేద్కర్ వర్సిటీలో ఎల్ఎల్బి కోర్సు కు షరతులతో కూడిన గుర్తింపును ఇచ్చిందని చెప్పారు. బీసీఐ నిర్దేశించిన ప్రమాణాలను ఇప్పటికీ పాటిస్తున్నామని వీటిని మరింత సమర్థవంతంగా అమలు చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఎల్ ఎల్ బి కోర్సులో 60 సీట్లకు అనుమతి లభించింది అన్నారు. న్యాయ శాస్త్రానికి సంబంధించి కొత్తగా కొన్ని అంశాలు పొందుపరచాలని ఇంటర్న షిప్, మూక్ కోర్టు, లీగల్ ఎయిడ్ క్లినిక్ తదితర వాటిని ఏర్పాటు చేయాలని బిసిఐ సూచించింది అన్నారు. ఈమేరకు రాష్ట్ర ఉన్నత విద్యా మండలికి నివేదించి ఈ ఏడాది ప్రవేశాల కోసం చర్చిస్తామన్నారు. ఉన్నత విద్యా మండలి నుంచి అనుమతులు వచ్చాక స్పాట్ అడ్మిషన్లను చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో వర్సిటీ రిజిస్టర్ ప్రొఫెసర్ సిహెచ్ఎ రాజేంద్రప్రసాద్, ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ బిడ్డిక అడ్డయ్య, కోర్సు కోఆర్డినేటర్ రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్తరాంధ్ర సమస్యలపై ఉద్యమిస్తా... : దుప్పల

విశాలాంధ్ర-శ్రీకాకుళం స్పోర్ట్స్/క్రైం: విశాఖ మహానగరాన్ని మినహాయిస్తే, ఉత్తరాంధ్ర అన్ని రంగాలలో అట్టడుగు స్థాయిలో వుందని గ్రాడ్యు యేట్స్ నియోజకవర్గం నుంచి ఇండిపెండెంట్‌గా పోటీచేసిన దుప్పల రవీంద్రబాబు ఆవేదన వ్యక్తం చేశారు. ఉత్తరాంధ్ర వెనుకబాటుతనాన్ని మేధావి వర్గం దృష్టికి తీసుకువెళ్లడానికే పోటీ చేశానని చెప్పారు. స్థానిక ఒక హోటల్లో బుధవారం ఉదయం మీడియా సమావేశం ఏర్పాటు చేసి ఆయన మాట్లాడారు. తన అభిప్రాయాలు మంచి చర్చకు దారితీయడానికి మీడియా సహకరించిం దని ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. పట్టభద్రులు సామాజికంగా చైతన్యవంతులని, సామాన్యులు నమ్ముతారని కానీ ఈసారి చాలామంది ఆ నమ్మకాన్ని వమ్ము చేశారని రవీంద్రబాబు ఆవేదన వ్యక్తం చేశారు. కులం, ధనం, అధికారం ఈ ఎన్నికలలో కీలక పాత్ర పోషించడం, ప్రజాస్వామ్యానికి ప్రమాద సూచికలన్నారు. ఉత్తరాంధ్ర గురించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను నిలదీసే వ్యక్తి, శక్తి లేని స్థితిలో ఈ ప్రాంత ప్రజాప్రతినిధులు ఉన్నారని విమర్శించారు. ఉత్తరాంధ్రను కేంద్రం వెనుకబడిన ప్రాంతంగా గుర్తించి, మంజూరు చేస్తున్న నిధులు ఏమవుతున్నాయని, రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళిక రూపొందించిందా? అని ప్రశ్నించారు. వలసల నివారణకు, ఐటిఐ, డిప్లొమా, డిగ్రీ చదివిన వారికి ఉపాధి అవకాశాలు లేని భారీ పరిశ్రమలకు రాయితీలు ఇవ్వడం సరికాదన్నారు. చిన్న పరిశ్రమలను ప్రోత్సహించాలని, నియోజక వర్గం యూనిట్ గా ప్రభుత్వ పారిశ్రామిక విధానం వుండాలని రవీంద్రబాబు డిమాండ్ చేశారు. ఉత్తరాంధ్ర వ్యవసాయ రంగం శరవేగంగా దిగజారిపోతుందని, సాగు భూములు రియల్ ఎస్టేట్లుగా మారిపోతున్నాయని, తన భూమిలోనే రైతు, కూలీగా బతికే స్థితి వచ్చిందన్నారు. సాగునీటి సదుపాయం వుంటే, భూమిని రైతు అమ్ముకోడని చెప్పారు. విశాలమైన సముద్ర తీరం ఉన్నా విశాఖ-పారాదీప్ మధ్య ఫిషింగ్ హార్బర్ లేక, వీరావల్ వంటి ప్రాంతాలకు మత్స్యకార యువత వలసపోతున్నారని చెప్పారు. త్వరలో ఉత్తరాంధ్ర సమస్యలు - పరిష్కార మార్గాలు అనే అంశంపై చర్చావేదికలు నిర్వహిస్తామన్నారు.

- ఉత్తరాంధ్ర జల సాధన, సంరక్షణ సమితి కన్వీనర్‌గా సమావేశానికి అధ్యక్షత వహించిన కవీ, జర్నలిస్టు నల్లి ధర్మారావు ముందుగా మాటాడుతూ సిక్కోలు జల సాధన, సంరక్షణ సమితిని, ఉత్తరాంధ్ర సమితిగా విస్తరిస్తున్నట్టు చెప్పారు. దీనికి కన్వీనర్ గా రవీంద్రబాబు ఉంటారనీ, రిటైర్డ్ ఇరిగేషన్ ఇంజనీర్లు, ప్రొఫెసర్లు, రైతు సంఘాల ప్రతినిధులు, ఆసక్తి గల మేధావులతో పూర్తి కమిటీని త్వరలో ప్రకటిస్తామన్నారు.

మహదేవన్ కుటుంబానికి ఎస్పీ నగదు అందజేత

విశాలాంధ్ర-నరసన్నపేట : పోలీస్ శాఖలో విధులు నిర్వహిస్తూ అనారోగ్యంతో మృతి చెందిన కుటుంబాలకు బుధవారం జిల్లా ఎస్పీ, జి.ఆర్. రాధిక నగదు చెక్కులను అందచేశారు. పోలాకి పోలీస్ స్టేషన్లో విధులు నిర్వహిస్తూ, అనారోగ్యంతో మరణించిన హెడ్ కానిస్టేబుల్, వి.మహదేవన్ కుటుంబ సభ్యులకు రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన రూ. 75,000 నగదు చెక్కు అందచేశారు. ఈ సంధర్భంగా ఎస్పీ రాధిక మాట్లాడుతూ కుటుంబ నేపథ్యం, పిల్లల చదువు తదితర అంశాలపై చర్చించి, మీకు మీ కుటుంబ సభ్యులకు జిల్లా పోలీస్ శాఖ అండగా వుంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ, టి.పి.విఠలేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

సక్రమంగా విధులు నిర్వహించండి : డ్వామా పీడీ

విశాలాంధ్ర-గార : క్షేత్రస్థాయిలో సిబ్బంది తమ విధులను సక్రమంగా నిర్వహించడం ద్వారా ఉపాధి హామీ పథకం విజయవంతం అయ్యేవిధంగా చూడాలని జిల్లా నీటి యాజమాన్య సంస్థ పథక సంచాలకులు జీవి చిట్టిరాజు సిబ్బందినీ కోరారు. బుధవారం ఉపాధి హామీ కార్యాలయాన్ని ఆకస్మికంగా సందర్శించిన ఆయన అక్కడ సిబ్బంది పనితీరును పరిశీలించారు. అనంతరం సిబ్బందిని ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ జాబ్ కార్డులోని సమాచారం ఆధార్ కార్డులోని సమాచారం ఒకే విధంగా ఉండాలని, అలా లేనట్లయితే కూలీలకు వేతనాలు వారి ఖాతాల్లో జమ కావన్నారు. అటువంటి తప్పులను గుర్తించి యుద్ద ప్రాతిపదికన సరి చేయాలని సిబ్బందిని ఆదేశించారు. ప్లాంటేషన్ పనుల్లో భాగంగా చేపట్టిన మొక్కల పెంపకం పనుల్లో నూటికి నూరు శాతం మొక్కలు క్షేత్రస్థాయిలో ఉండాల్సిందేనని స్పష్టం చేశారు. పోయిన మొక్కల స్థానంలో కొత్త మొక్కలను తక్షణం నాటాలని ఆదేశించారు. క్షేత్రస్థాయి సమస్యలను మండలంలోని పరిష్కరించాలని, ఎటువంటి ఫిర్యాదులు వచ్చిన చర్యలు తీసుకుంటానన్నారు. భూగర్భ జలమట్టాన్ని పెంపొందించే పనులకు అత్యధిక ప్రాధాన్యతను ఇవ్వాలని, ఇతర ప్రత్యామ్నాయ పనులు చేపట్టడంపై దృష్టి సారించాలన్నారు. ప్రతి గ్రామంలో పనులు జరగాలని జిల్లాకు కేటాయించిన పని దినాల లక్ష్యాన్ని చేరుకునేందుకు గాను ఇప్పటికే సిబ్బందికి లక్ష్యాలను నిర్దేశించడం జరిగిందని పేర్కొన్నారు. సగటు వేతనం రూ 250 ఉండాలని, అదేవిధంగా లక్ష్యాల మేరకు పని దినాలను కల్పించనీ సిబ్బందిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. పనుల్లో నాణ్యతకు మరియు పారదర్శకతకు ప్రాధాన్యతను ఇవ్వాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ఏపీవో సంధ్యారాణి, జెఈ నారం నాయుడు, ఇతర ఉపాధి హామీ పథకం సిబ్బంది పాల్గొన్నారు.

నాయకత్వ అభివృద్ధి శిక్షణా కార్యక్రమం

విశాలాంధ్ర-అరసవల్లి: నాయకత్వ అభివృద్ధి శిక్షణా కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కో ఆపరేటివ్ అధికారి ఎస్. సుబ్బారావు పిలుపునిచ్చారు. నేషన్ సెంటర్ ఫర్ కో ఆపరేటివ్ ఎడ్యుకేషన్, న్యూ ఢిల్లీ ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సహకార యూనియన్, విజయవాడ, రామదాసు సహకార శిక్షణా కేంద్రం, రాజమండ్రి వారు జిల్లాలోని లేబర్స్ కాంట్రాక్ట్ కో ఆపరేటివ్ సొసైటీస్ చైర్మన్లు, పాలకవర్గ సభ్యులకు నాయకత్వ అభివృద్ధిపై మూడురోజుల శిక్షణా కార్యక్రమాన్ని బుధవారం స్థానిక ఎన్జీవో హోంలో సుబ్బారావు ప్రారంభించారు. ప్రారంభమైన శిక్షణా కార్యక్రమం మూడు రోజుల పాటు జరుగనుందని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. నాయకత్వ అభివృద్ధిని పెంపొందించుకునేందుకు ఈ శిక్షణ ఎంతగానో ఉపయోగపడుతుందని వివరించారు. అల్పాదాయ వర్గాలకు చెందిన ఈ సొసైటీ పాలకవర్గాలకు విద్య, నైపుణ్యం పెంపొందించడమే న్యూఢిల్లీకి చెందిన ఎన్సిసిపి ముఖ్య ఉద్దేశ్యమని, అందులో భాగంగానే జిల్లాలో మూడు రోజుల పాటు ఈ శిక్షణా కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు వివరించారు. సహకార సంఘాల నిర్వహణ, సహకార విలువలు, సూత్రాలు, పాలకవర్గ అధికారాలు, విధులు తదితర అంశాలపై పూర్తిస్థాయిలో శిక్షణనివ్వడం జరుగుతుందని చెప్పారు. ఈ శిక్షణను సద్వినియోగం చేసుకుని తద్వారా సహకార సంఘాలు ఆర్థికంగా బలోపేతం కావాలని సుబ్బారావు ఆకాంక్షించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సహకార యూనియన్ ప్రిన్సిపాల్ జి. శ్రీనివాసరావు అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో రామదాసు సహకార శిక్షణా కేంద్రం ప్రిన్సిపాల్ వి. శ్రీనివాస్, డివిజినల్ సహకార అధికారి కె. దామోదర్, సబ్ డివిజనల్ సహకార అధికారి ఎస్. భూషణరావు, అసిస్టెంట్ రిజిస్ట్రార్ పూజారి జానకీరాం, ఎం. శ్రీనివాసరావు, ఎఫ్. పద్మ, జి. అరుణకుమారి, జి.వి. రమణమూర్తి, జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి వివిధ లేబర్స్ కాంట్రాక్ట్ కో ఆపరేటివ్ సొసైటీ చైర్మన్లు, పాలకవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

హత్య కేసుల్లో నిందితులను అరెస్ట్ చేయాలి

విశాలాంధ్ర-కొత్తూరు : జిల్లాల్లో దళిత హత్య కేసుల్లో నిందితులుగా ఉన్నవారిని తక్షణమే అరెస్ట్ చేయాలని కొత్తూరు మండలం దళిత మహాసభ నాయకులు బుధవారం ఇక్కడొక పత్రికా విలేకరుల సమావేశంలో డిమాండ్ చేశారు. బూర్జ మండలం నీలంపేట గ్రామానికి చెందిన జమ్మనా సుదర్శన్, ఎచ్చర్ల మండలం చిలక పాలెం గ్రామానికి చెందిన లింగాల నరేంద్ర కుమార్ హత్య కేసులో నింధితులను అరెస్ట్ చెసి బాధిత కుటుంబాలకు న్యాయం చేయాలని దళిత మహాసభ నాయకులు ఈ ప్రకటనలో అధికారులను డిమాండ్ చేశారు. ఈ పత్రికా విలేకరుల సమావేశంలో దళిత మహాసభ అధ్యక్షులు టి.తిరుపతి రావు, కన్వీనర్ పడాల నాగభూషణ్‌రావు, ఉపాధ్యక్షులు నౌపడ జగజీవన్‌రావు కోశాధికారి బొడ్డేపల్లి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతోనే గుర్తింపు లభిస్తుంది : డాక్టర్ సూర శ్రీనివాసరావు

విశాలాంధ్ర-శ్రీకాకుళం స్పోర్ట్స్/క్రైం : క్రీడల్లో ఉన్నతంగా రాణించడం ద్వారా జాతీయ, అంతర్జాతీయస్థాయిలో సైతం మంచి గుర్తింపు లభిస్తుందని ఎస్ ఎస్ ఆర్ చారిట్రబుల్ ట్రస్టు అధినేత సూర శ్రీనివాసరావు అన్నారు. నగరంలోని ఆర్ట్స్ కళాశాల మైదానంలో నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో బుధవారం జరిగిన పోటీల బహుమతి ప్రధానోత్సవానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా సూర శ్రీనివాసరావు మాట్లాడుతూ బాల్‌బాడ్మింటెన్ క్రీడకు ప్రపంచ వాప్తంగా గుర్తింపు ఉందని, క్రీడాకారులు పట్టుదలతో రాణించి ఉన్నత లక్ష్యాలను సాధించాలని ఆకాంక్షించారు. చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించడం ద్వారా ఉద్యోగావకాశాలు లభిస్తాయని తెలిపారు. కలలు కనండి... వాటిని నిజం చేసుకోండని చెప్పిన అబ్దుల్ కలామ్ మాటలను మననం చేసుకుంటూ క్రీడాకారులు కఠోరశ్రమ చేసి విజయం వైపు సాగాలని చెప్పారు. ఈ సందర్భంగా నెల్లూరులో 17,18,19 తేదీల్లో రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనున్న క్రీడాకారులను అభినందించి, పతకాలు సాధించి జిల్లా కీర్తిని దేశనలుమూలలా చాటాలని చెప్పారు. 48 క్రీడాకారులకు దుస్తులు అందజేశారు. ఈ కార్యక్రమంలో క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

హెల్పింగ్ హాండ్స్ సంస్థ ఆధ్వర్యంలో వీల్ చైర్ పంపిణీ

విశాలాంధ్ర-కవిటి : హెల్పింగ్ హాండ్స్ సంస్థ ఆధ్వర్యంలో వికలాంగునికి వీల్ చైర్ పంపిణీ అలాగే రెండు నెలలకు సరిపడే నిత్యవసర సరుకులను అందజేశారు. ఈ సందర్భంగా బుధవారం కలింగపట్నం గ్రామా నికి చెందిన వికలాంగుడైన ఇద్ది హేమ సుందర్‌రావు అనే 12 సంవత్సరాల వికలాంగు డైన చిన్నారికి హెల్పింగ్ హాండ్స్ సంస్థ ఆధ్వర్యంలో బొరివంక గ్రామానికి చెందిన బల్లెడ విజయ ప్రసాద్ కుమారుడు జ్ఞాపకార్థంగా వీల్ చైర్ అలాగే దూగానపుట్టుగ గ్రామానికి చెందిన దూగాన ముత్యాలమ్మ జ్ఞాపకార్థంగా రెండు నెలలకు సరిపడే నిత్యవసర సరుకులను కుటుంబానికి అందజేశారు. ఈ కార్యక్రమంలో హెల్పింగ్ హ్యాండ్ సభ్యులు సాహూ కాళీ, వెంకటేష్, బాలయ్య, కళ్యాణ్, ఉప సర్పంచ్ ధర్మరాజు, గ్రామస్తులు పాల్గొన్నారు.

సదాశివ సేవా పౌండేషన్ ద్వారా పేదలకు సాయం

రాష్ట్ర కాళింగ కార్పొరేషన్ చైర్మన్ తిలక్

విశాలాంధ్ర-కోటబొమ్మాళి : తనతండ్రి సకలాభక్తుల సదాశివరావు జ్ఞాపకార్థం పేదలకు సహాయం చేసేందుకు సదాశివ సేవా పౌండేషన్‌ను తన కుమారుడు సకలాభక్తుల గంగారావు (గంగాధర్) ఏర్పాటు చేశారని రాష్ట్ర కాళింగ కార్పోరేషన్ చైర్మన్ పేరాడ తిలక్ అన్నారు. బుధవారం మాజీ పీఏసీఎస్ అద్యక్షుడు కింజరాపు హరివరప్రసాద్ సదాశివసేవా పౌండేషన్‌ను ప్రారంభించి వృద్దులకు, వికలాంగులకు బట్టలను పంపిణీ చేశారు. అలాగే పేరాడ తిలక్ సదాశివరావు జ్ఞాపకార్థం స్థానిక పెద్దలకు మోమెంటో (జ్ఞాపిక) అందజేశారు. అంతకుముందు పెద్దలు సదాశివరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా సదాశివ సేవా పౌండేషన్ సంస్థ చైర్మన్ సకలాభక్తుల గంగాధర్ మాట్లాడుతూ తన తండ్రి పేరును నిరంతరం గుర్తిండేందుకు ఈ సంస్థను అన్ని ప్రభుత్వ అనుమతులతో ప్రారంభించానని, దీని ద్వారా పేదలకు అన్ని రకాల సహాయ సహకారాలు అందించటం జరుగుతుందని, ఈ కార్యక్రమానికి గ్రామ పెద్దలు సహాయ సహకారాలు అందించాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా పలు పుణ్యక్షేత్రలలో తన తండ్రి జ్ఞాపకార్థం అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ దుబ్బ వెంకటరావు, ఎంపీపీలు రోణంకి ఉమామల్లేశ్వరరావు, శ్రీరామమూర్తి, వైఎస్ ఎంపీపీ దుక్క రోజారామక్రిష్ణ, మాజీ ఎంపీపీ తర్ర రామక్రిష్ణ, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బోయిన గోవిందరాజులు, కల్లి నాగయ్యరెడ్డి, లక్ష్మణరెడ్డి. ఎంపీటీసీ నంబాళ రాజశేఖర్, సర్పంచ్ కాళ్ళ సంజీవరావు, పలువురు గ్రామపెద్దలు, సత్యసాయిబాబా భక్తులు తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ మొదటి సంవత్సర పరీక్షకు 18 మంది గైర్హాజరు

విశాలాంధ్ర-ఆమదాలవలస: ఇంటర్మీడియట్ మొదటి సంవత్సర పరీక్షలు ప్రభుత్వ జూనియర్ కళాశాల, గవర్నమెంట్ జూనియర్ కాలేజ్ తోగరాం టి ఎస్ ఆర్ కాలేజ్, పరీక్షా కేంద్రాల్లో 605 మంది విద్యార్థులకు గాను 587 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారని, 18 మంది విద్యార్థులు పరీక్షలకు గైర్హాజరయ్యారని ఆయా కేంద్రాల సూపరిండెంట్లు తెలిపారు. ఆమదాలవలస ప్రభుత్వ జూనియర్ కళాశాల మొదటి సంవత్సరం పరీక్షలు రాయవలసిన విద్యార్థులు మొత్తం విద్యార్థులు 372 కాగా 367 మంది పరీక్షకు హాజరు కాగా 5 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని చీఫ్ సూపరింటెండెంట్ ఎస్ వి ఎల్ నారాయణ తెలిపారు. ఆమదాలవలస మండలం తోగరాం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మొదటి ఏడాది చదివిన విద్యార్థులు 97 మంది వుండగా పరీక్షలకు హాజరైన విద్యార్థులు 94 మంది, గైర్హాజరైన విద్యార్థులు ముగ్గురు అని చీఫ్ సూపరింటెండెంట్ భారతి తెలిపారు. ఆమదాలవలస టిఎస్ఆర్ ప్రైవేట్ జూనియర్ కళాశాల మొత్తం విద్యార్థులు 136 మంది, పరీక్షకు 126 మంది విద్యార్థులు హాజరయ్యారని, 10 మంది గైర్హాజరైన విద్యార్థులు వున్నారని చీఫ్ సూపరింటెండెంట్ పద్మావతి తెలిపారు. ప్రశాంత వాతావరణంలో పరీక్షలు నిర్వహించగలిగామని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్స్ వివరించారు.

పాఠశాలకు గ్రైండర్ వితరణ



విశాలాంధ్ర-పలాస : కాశీబుగ్గ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు గ్రీన్ ఆర్మీ ఆధ్వర్యంలో మధ్యాహ్న భోజన పథకంలో భాగంగా విద్యార్థు లకు ఆహార పదార్థాలు వంట చేసేందుకు వీలుగా పాఠశాల ఉపాధ్యాయురాలు నగిరి లక్ష్మీ, గ్రీన్ ఆర్మీ సంయుక్తంగా కొనుగోలు చేసిన గ్రైండర్ ను బుధవారం విద్యార్థులకు అందజేశారు. కార్యక్ర మంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు హరి బాబు, గ్రీన్ ఆర్మీ అధ్యక్షులు బోనేల గోపాల్, జాతీయ అవార్డు గ్రహీత ఆసపాన మధుబాబు, ఇరిగేషన్ అధికారి శ్రీనివాసరావు, సైన్సు ఉపాధ్యా యులు బోకర దుర్యోధన, మొక్కల ప్రేమికులు కొత్త పల్లి చిన్నారి, గ్రీన్ ఆర్మీ కార్యదర్శి బందాపు తిరు మల, పాఠశాల ఉపాధ్యాయినిలు, ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

అబ్బురపరిచే ఆస్కార్

విశాలాంధ్ర-పలాస : పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీ గాంధీనగర్ 21వ వార్డుకు చెందిన ప్రముఖ సూక్ష్మ కళాకారులు కొత్తపల్లి రమేష్ ఆచారి తెలుగు చలనచిత్ర రంగంలో సంచలనం సృష్టించిన ఆర్ఆర్ఆర్ రాజమౌళి దర్శకత్వం వహించిన చిత్రంలో నాటునాటు అనే పాటకు ఆస్కార్ అవార్డు లభించిన సందర్భంగా చాక్‌పీస్‌పై అద్భుతమైన కళాఖండాన్ని తయారు చేశారు. దీని తయారీకి మూడు గంటల సమయం పట్టినట్లు రమేష్ తెలిపారు. దీని ఎత్తు రెండు సెంటీమీటర్లు, వెడల్పు అర సెంటీమీటర్ ఉంటుందని చెప్పారు. ఆస్కార్ బొమ్మను తయారు చేసిన రమేష్ కు పలాస కాశీబుగ్గ జంట పట్టణాల ప్రజలు అభినందనలు తెలిపారు.

పాడె మోసిన మాజీ ఎమ్మెల్యే సాయిరాజ్

విశాలాంధ్ర-కవిటి : జగతి గ్రామ మాజీ సర్పంచ్ పిరియా వెంకటరమణ(కర్రి బాబు) అంత్యక్రియల్లో మాజీ ఎమ్మెల్యే, వైఎస్ఆర్సిపి ఇచ్ఛాపురం నియోజకవర్గం సమన్వయకర్త పిరియా సాయిరాజ్ పాల్గొని పాడే మోశారు. జగతి గ్రామపంచాయతీ మాజీ సర్పంచ్ పిరియా వెంకటరమణమూర్తి రెండు పర్యాయాలు సర్పంచ్‌గా ఎంపీటీసీగా నిర్వహించారు. గత కొద్దిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ బుధవారం మృతి చెందారు.విషయాన్ని తెలుసుకున్న సాయిరాజ్ హుటా హుటిన వెంకటరమణ నివాసం వద్దకు చేరుకొని కుటుంబాన్ని పరామర్శించి ఓదార్చారు. వైయస్సార్ పార్టీ ఆ కుటుంబానికి అండ ఉంటుందని భరోసా కల్పించారు. ఈ అంతిమయాత్రలో వైస్ ఎంపీపీ పూడి నేతాజీ,బెజ్జిపుట్టుగ సర్పంచ్ ఎస్.పి.నారాయణ స్వామి తోపాటు అధిక సంఖ్యలో అభిమానులు పాల్గొన్నారు.

మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి పథకం బలోపేతం చేయాలి

అయార్లా, ఏఐకెఎం

విశాలాంధ్ర-పలాస : బొడ్డపాడు గ్రామ పంచాయతీ కార్యాలయం, ఉపాధి హామీ పథకం కార్మికులు పనిచేసే వద్దకే అఖిల భారత వ్యవసాయ గ్రామీణా కార్మిక సంఘం, అఖిల భారత కిసాన్ మహాసభ, ఆలిండియా ట్రేడ్ యూనియన్ నాయకులు కామ్రేడ్ తామాడ సన్యాసిరావు, మద్దిల రామారావు, దున్న శ్రీనివాస్‌లు పాల్గొన్నారు. సభకు అధ్యక్షతన కామ్రేడ్ దుష్యంత్ వహించారు. కార్మికులను ఉద్దేశించి జాతీయ నాయకులు అయర్లా మాట్లాడుతూ అనేక ఉద్యమాలు చేసి సంపాదించిన జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి తూట్లు పొడుస్తూ నిర్వీర్యం చేసే ప్రయత్నం మోదీ ప్రభుత్వం చేస్తుందన్నారు. బడ్జెట్‌లో పూర్తిస్థాయి కోతలు విధిస్తూ,, రెండు లక్షల కోట్ల పైచిలుకు బడ్జెట్ కేటాయింపులు జరగాల్సి ఉండగా, కేవలం అరవై వేల కోట్ల కేటాయించి, చేతులు దులుపుకున్నారన్నారు. మన కేంద్ర మంత్రి సీతారామన్, అందులో ఇరవై వేల కోట్లు పాత బకాయిలున్నాయి. అంచెలంచెలుగా దీన్ని రద్దు చేసేదానికి తప్ప, ఇంకొకటి కాదని నాయకులు హెచ్చరించారు. 200 రోజులు పనిదినాలను కేటాయింపులు జరపాలి, అలాగే కనీస వేతనం రూ.600లు పెంచాలని డిమాండ్ చేశారు. ఆధారిత లింకు పేరుతో సాంకేతిక లోపాలతో వేతనాలు రాక కార్మికులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. పాత తరం విధానాలే అమలు చేయాలని నాయకులు డిమాండ్ చేశారు. పట్టణ, గ్రామీణ ఉపాధి హామీ పథకం కార్మికులకు సమగ్ర చట్టం చేయాలని కోరారు. కార్యక్రమం లో సిపిఐ యం యల్ లిబరేషన్ నాయకులు కార్యకర్తలు పోతనపల్లి కామేశ్వరరావు, అప్పారావు, దుష్యంత్, జగదీష్, రామక్రిష్ణ, యుగంధర్, యువజన నాయకులు కామ్రేడ్ కైలాస్‌లతో కలిసి పైవిషయాలు కేంద్రం వరకు చేరే దానికి స్థానిక పంచాయతీ సెక్రటరీకి మెమోరాండం సమర్పించారు.

ఈనెల 23న శ్రీ సీతారామ విగ్రహ ప్రతిష్ట మహోత్సవం

విశాలాంధ్ర-నరసన్నపేట : ఈనెల 23, 24వ తేదీల్లో పట్టణంలోని పురుషోత్త మనగర్ కాలనీల్లో శ్రీ సీతారామాలక్ష్మణ ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్టా మహోత్సవం నిర్వహించబడునని రాజీవ్ సేవా సంఘం అధ్యక్షులు, పతివాడ గిరీశ్వర రావు అన్నారు. బుధవారం పురుషోత్తమ నగర్ కాలనీలో రాజీవ్ సేవా సంఘం సభ్యులు ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో గిరీశ్వరరావు మాట్లాడుతూ 23వ తేదీ గురువారం ఉదయం పది గంటలకు గ్రామ పురోహితులు, వనమాలి బాలకృష్ణశర్మ, వెంకట శ్యామ్‌సుందర్‌శర్మ పర్యవేక్షణలో విగ్రహములు గ్రామ ప్రదర్శన నిర్వహించబడునని, 24వ తేదీన ఉదయం 7గంటలకు వేదపారాయణ మండప అర్చనలు, హోమములు, పూర్ణాహుతి, అనంతరం శ్రీసీతారామ లక్ష్మణ ఆంజనేయ స్వామివారి విగ్రహాలు ఆలయంలో ప్రతిష్ట చేయబడునని తెలిపారు. మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ జరుపబడునని, ఈ ఆలయ నిర్మాణానికి పట్టణ ప్రజలు, వ్యాపారులు అందించిన ఆర్థిక సాయానికి రాజీవ్ సేవా సంఘం కృతజ్ఞతలు తెలియచేశారు. ఈకార్యక్రమంలో రాజీవ్ సేవాసంఘం ప్రతినిధులు, బొబ్బాది సూర్యం, జవ్వాది రాజేష్, కుప్పిలి వెంకటరమణ, సిహెచ్.రామారావు, పి.కృష్ణప్రసాద్, ఎన్.వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎండీయు ఆపరేటర్ల ఇన్సూరెన్స్ ప్రభుత్వమే చెల్లించాలి

విశాలాంధ్ర-శ్రీకాకుళం టౌన్ : కలెక్టరేట్‌లో జరిగిన సమావేశానికి హాజరైన పౌర సరఫరాల శాఖ కమిషనర్ అరుణ్ కుమార్‌ను, ఎండియూ ఆపరేటర్ల అసోసియే షన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు రౌతు సూర్యనారాయణ మర్యాదపూర్వకంగా కలుసు కున్నారు. ఈ సందర్భంగా ఎండియూ ఆపరేటర్ల సమస్యలను సూర్యనారాయణ కమిషనర్ వద్ద ప్రస్తావించారు. వాహనాలకు సంబంధించి ఇన్సురెన్సు సొమ్మును ప్రభుత్వమే చెల్లిస్తుందని జీవో విడుదల చేశారని, అయిప్పటికీ అమలు కాలేదని, బ్యాంకు అధికారులు తమ ఖాతాల్లోకి వ్యక్తిగత సొమ్మును తీసుకున్నారని తెలిపారు. దీనిపై కమిషనర్ స్పందిస్తూ ప్రభుత్వం దృష్టికీ తీసుకువెళ్లి ఎండియూ ఆపరేటర్ల సమస్యలను పరిష్కరిస్తామని స్పష్టం చేశారు. ఏది ఏమైనప్పటికీ ఈ నెలాఖరులోగా తమకు సరైన న్యాయం జరగకుంటే వచ్చే నెలలో వాహనాలను తామునడపలేమని సూర్యనారాయణ స్పష్టం చేశారు. గత సంవత్సర కాలంగా పెండింగ్లో ఉన్న జీతాలు తక్షణమే వారికి అందేలా చేయాలని కోరారు. కమిషనర్‌ని కలిసినవారిలో అర్బన్ ఎండియు ఆపరే టర్స్ అప్పారావు, బాలకృష్ణ, మాధవ్, సంతోష్, కిషోర్, కిరణ్, ఈశ్వర్, దివాకర్, శంకర్ తదితరులున్నారు.

ఘనంగా ముగిసిన 'శ్రీ నవగ్రహ విగ్రహాల ప్రతిష్ట'

'అన్న సమారాధన'కు పోటెత్తిన ప్రజలు

విశాలాంధ్ర-నరసన్నపేట : స్థానిక పాత బస్టాండ్ సమీపంలో వున్న శ్రీ ఉమామహేశ్వర స్వామివారి దేవాలయ ప్రాంగణంలో గత మూడు రోజులుగా నిర్వహిస్తున్న శ్రీ నవగ్రహ విగ్రహముల ప్రతిష్టా కార్యక్రమం బుధవారంతో ముగిసింది. సత్యవరాగ్రహార పురోహితులు, వనమాలి ప్రభాకరరావు పర్యవేక్షణలో బుధవారం ఉదయం మండల మంటప ఆవాహన దేవతల హోమం, జయాది హోమం, పూర్ణాహుతి నిర్వహించి, నవగ్రహ యంత్ర విగ్రహముల ప్రాణ ప్రతిష్ట నేత్రోన్మీలనము, ధేను-దర్పణ దర్శనములు, అవభృద స్నానము, ఆశీర్వచనము, మంగళ హారతి, దీక్షా విరమణ మంగళ వాయిద్యాల నడుమ జరిపారు. మధ్యాహ్నం అధిక సంఖ్యలో హాజరైన ప్రజానీకానికి అన్న సమారాధన నిర్వహించి, సాయంత్రం, శ్రీ షిర్డీసాయి భక్త భజన బృందం, గోపాలపెంట వారిచే భజనలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శ్రీ ఉమామహేశ్వర స్వామివారి ఆలయ అర్చకులు, వసనాభి గణేష్‌బాబు, రామేశ్వర్ సోదరులు, నవగ్రహ ప్రతిష్టాపకులు, మార్పు వెంకట అప్పలనాయుడు, సుశీల దంపతులు, మార్పు విజయ్‌కుమార్, లత దంపతులు, మార్పు రమణమూర్తి, నందిని దంపతులు, పొందల రామకృష్ణ, శోభ దంపతులు, అధికసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

వినియోగదారుల హక్కులు పరిరక్షించాలి

నెహ్రూ యువకేంద్రం కో-ఆర్డినేటర్ ఉజ్వల్

విశాలాంధ్ర-శ్రీకాకుళం రూరల్ : కొనే ప్రతి వస్తువులోనూ, సేవలోనూ లోపం లేకుండా సరైన ధర, తూకం, నాణ్యత, స్వచ్ఛత కలిగినవి పొందే హక్కు వినియోగదారులకు ఉందని నెహ్రూ యువకేంద్రం కో- ఆర్డినేటర్ ఉజ్వల్ అన్నారు. నగరంలోని ఆర్ట్స్ కళాశాల మైదానంలో బుధవారం ప్రపంచ వినియోగదారుల దినోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. వినియోగదారుల హక్కులు, వినియోగదారుల చట్టం 1986 చట్టంనుంచి ప్రయోజనాలు ఎలా పొందాలో వివరించారు. ప్రస్తుత కాలంలో మోసాలు ఎక్కువై పోయాయని, చివరికి మనం తాగే పాలు, నీళ్లలో కూడా నాణ్యత లేకుండా పోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. తూకాల్లో భారీగా తేడాలు ఉంటున్నాయని, వీటిపై ఎవరైనా ప్రశ్నిస్తే, నిలదీస్తే తప్ప న్యాయం జరగడం లేదని తెలిపారు. ఈ తరహా మోసాలను అరికట్టాలంటే వినియోగదారులే మేల్కొనాల్సిన అవసరం చాలా ఉందని పిలుపునిచ్చారు. తమ హక్కులపై అవగాహన పెంచుకోవాల్సిన అవసరముందని చెప్పారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న దేశాలు ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవాన్ని మానవ హక్కుల సమావేశాలు నిర్వహించి, వినియోగదారుల హక్కులను పరిరక్షించడానికి వివిధ మార్గాలను చర్చించడం ద్వారా జరుపుకుంటాయని వివరించారు. శ్రీకాకుళం ఆసరా జిల్లా అధ్యక్షులు గంజి ఎజ్రా, స్టార్ వాకర్స్ క్లబ్ అధ్యక్షులు జోగినాయుడు, జి. ఇందిరాప్రసాద్, టీవీ రవికుమార్, ఆర్సి కూన వెంకటరమణమూర్తి, ఎం మల్లిబాబు, కోశాధికారి బి.దేవీప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా శ్రీకాకుళం ప్రెస్‌క్లబ్ అధ్యక్షులు కొంక్యాన వేణుగోపాల్ ఇంటాక్ జిల్లా అధికారి నారాయణరావు, నెహ్రూ యువకేంద్రం కో- ఆర్డినేటర్ ఉజ్వల్‌ను దుశ్శాలువతో ఘనంగా సత్కరించారు.

పిఎండిఎస్ విత్తనాలు పంపిణీ

విశాలాంధ్ర-బూర్జ : ప్రకృతి వ్యవసాయం చేసే రైతులకు ముప్పై రకాల విత్తనాలతో కూడిన పిఎండిఎస్ కిట్స్ ను తయారు చేశామని మాస్టర్ ట్రైనర్ చిన్నమ్మడు తెలిపారు. బుధవారం మండల పరిధిలోని పాలవలస యూనిట్ రామన్నపేట రైతులకు డీపియమ్ రేవతి చేతుల మీదుగా అందజేశారు. అనంతరం రైతులతో సమావేశమై పకృతి వ్యవసాయంపైన సలహాలు సూచనలు అందజేశారు. మాస్టర్ ట్రైనర్ చిన్నమ్మడు మాట్లాడుతూ ఒకే రకమైన పంటను కాకుండా భూమికి అవసరమయ్యే అన్ని రకాల పోషకాలను ఈ పిఎండిఎస్(ప్రి మాన్సూన్ డ్రై సోయింగ్) విధానం ద్వారా సాగు చేసినట్లయితే నేలకు అన్ని రకాల సూక్ష్మ పోషకాలు అంది భూమి సారవంతమై అధిక దిగుబడులు వస్తాయన్నారు. ఈ విత్తనాల లో ఏకదలం, ద్విదలం, నూనె గింజలు, సుగంధ ద్రవ్యాలు ఉంటాయని ఇలా అన్ని రకాల విత్తనాలు కలుపుకుని ఎకరానికి పద్దెనిమిది నుండి ముప్పై రకాలు విత్తుకోవాలని తెలిపారు. ఈ కిట్ లో సజ్జ, జొన్న, రాగి, అలసంద, ఆముదం, కంది, సన్ ఫ్లవర్, పెసర, బెండ, మటిక, ముల్లంగి, ఆకు కూరలు, టమోటా, మిర్చి, వేరుశనగ, నువ్వులు, ఆవాలు, ధనియాలు, ఉలవలు తదితర వాటిని విత్తుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో యూనిట్ ఇన్చార్జ్ గురువు జనార్ధనరావు, శ్రావణి, ఐసీఆర్పీలు, ఐబీ వాలంటీర్లు, స్థానిక రైతులు పాల్గొన్నారు.

బుర్లే కుటుంబం వితరణ



విశాలాంధ్ర-కొత్తూరు : మండలం నెరడి గ్రామంలో వెలసిఉన్న శ్రీరామ మందిరం అలాయాభి వృద్ధికి మెట్టూరు బిట్1 కృష్ణాపురం గ్రామానికి చెందిన దువంగత్ మాజీ సర్పంచ్ బుర్లే రామమూర్తి నాయుడు జ్ఞాపకర్ధం ఆయన భార్య బుర్లే అచ్చమ్మ 20116 రూపాయిలు ఆర్థిక సహాయాన్ని ఆలయకమిటీకి బుధవారం అందజేశారు, ఈ కార్యక్రమంలో ఆమె కుమారులు బుర్లే కృష్ణారావు, బుర్లే శ్రీనివాస్‌రావులు పాల్గొన్నారు.

సౌత్‌జోన్ పోటీల్లో పాలిటెక్నిక్ విద్యార్థిని ప్రతిభ

విశాలాంధ్ర-ఎచ్చర్ల : ఈనెల 11, 12 తేదీల్లో జరిగిన సౌత్ జోన్ అంతరవర్సిటీ పాలిటెక్నిక్ పోటీల్లో శ్రీకాకుళం మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో కంప్యూటర్ సైన్స్ కోర్సును ప్రథమ సంవత్సరం చదువుతున్న విద్యార్థిని కే హర్షిత ప్రతిభ కనబరిచారు. టేబుల్ టెన్నిస్ సింగిల్స్ విభాగంలో ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకుని సత్తాను చాటారు. ఈ ఏడాది ఫిబ్రవరి నెలలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో ఈ విద్యార్థిని పాల్గొని రన్నర్ గా నిలిచారు. త్వరలో జరగనున్న జాతీయ స్థాయిలో జరిగే పోటీల్లో ఈ విద్యార్థిని పాల్గొనుంది. ఈ విద్యార్థిని చూసిన ప్రతిభ పట్ల కళాశాల ప్రిన్సిపాల్ ఆదిలక్ష్మి, కంప్యూటర్ సైన్స్ విభాగాధిపతి కే శ్రీనివాసరావు, పిడి ఎం బేబీ రాణి తదితరులు అభినందించారు.

ఉషోదయ యువజన సంఘం నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం

విశాలాంధ్ర-కవిటి : మండల కేంద్రమైన కవిటి ఉషోదయ యువజన సంఘం నూతన కార్యవర్గం గౌరవాధ్యక్షులు బెందాళం చిట్టిబాబు ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా బుధవారం ఉషోదయ యువజన సంఘం భవనం వద్ద సభ్యులు సమావేశం అయ్యారు. ఈ మేరకు ఉషోదయ యువజన సంఘం గౌరవ అధ్యక్షులుగా బెందాళం చిట్టిబాబు, అధ్యక్షులుగా పాండవ చంద్రశేఖర్, ఉపాధ్యక్షులుగా బెందాళం హరి, కార్యదర్శిగా పులకల వెంకటరావు, సహాయ కార్యదర్శిగా తెప్పల మోహన్ రావు, ఆర్గనైజింగ్ సెక్రెటరీ జన్నెల లోకనాథం, కోశాధికారిగా మొర్రి ఆదినారాయణ, సహాయ కోశాధికారిగా పందిరి దశరథరావు లను ఏకగ్రీవంగా ఎన్నుకొని అనంతరం ప్రమాణ స్వీకార కార్యక్రమం చేపట్టారు. యువజన సంఘం అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామని సంఘ సభ్యులు తెలిపారు.

భక్తిశ్రద్ధలతో మీన సంక్రమణ పూజలు

విశాలాంధ్ర-కవిటి : మండలంలోని ముత్యాల పేట గ్రామంలో శ్రీ ముత్యాలమ్మ తల్లి ఆలయం, జగతి గ్రామంలోని మర్ల పోలమ్మ ఆలయం వద్ద మీన సంక్రమణ పూజలు భక్తి శ్రద్ధలతో గ్రామస్థుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ముత్యాలమ్మ తల్లి ఆలయ వార్షికోత్సవం సందర్భంగా ఆలయ పురోహితులు నారాయణ పాడి పూర్ణచంద్రపాడి పర్యవేక్షణలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. వేకువ జాము నుండి అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేపట్టి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గ్రామంతో పాటు చుట్టుప్రక్కల గ్రామస్తుల మహిళలచే సామూహిక కుంకుమ పూజలు కార్యక్రమం చేపట్టారు. భక్తులకు అన్న సంతర్పణ కార్యక్రమం ఏర్పాటు చేశారు.

నిరుద్యోగులకు గ్రంథాలయం దోహదపడుతుంది

విశాలాంధ్ర-పలాస : గ్రంథాలయం నిరుద్యోగులకు ఎంతగానో దోహదపడుతుందని నెఫ్రాలజిస్ట్ గొరకల గిరిబాబు, ఎంఎస్ ఇఎన్ టి దివ్య అన్నారు. మండలంలోని నీలావతి గ్రామంలో ఉద్దాన విద్యా అభివృద్ధి వేదిక ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన గ్రంథాలయాన్ని బుధవారం వారు సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు చిన్నప్పటి నుండే లక్ష్యాలు ఏర్పరచుకొని లక్ష్య సాధన కోసం నిరంతరం కృషి చేయాలన్నారు. యువివి చేస్తున్న కార్యక్రమాలకు ప్రశంసిస్తూ ఈ వేదికకు ఎల్లప్పుడు సహాయ సహకారాలు అందిస్తా మన్నారు. దేశ ప్రధాని ఆయుష్మాన్ భారత్ మిషన్ స్ఫూర్తిని తీసుకొని తాము కూడా ఆయుష్మాన్ ఉద్దానం పేరుతో సామాజిక సేవా కార్యక్రమాలు చేస్తామన్నారు. అనంతరం గిరిబాబు, దివ్యలకు ఘనంగా సన్మానం చేశారు. కార్యక్రమంలో యువివి అధ్యక్ష ప్రధాన కార్యదర్శి జోగారావు, బొడ్డు చిన్నారావు, కుత్తుం ప్రకాష్ మాస్టారు, యంపళ్ళ కామేష్ జనగ సీతారాం, కుత్తుం సుధాకర్, ఖగేష్, మడియ వాసు, సోమేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ప్రారంభమైన ఇంటర్ పరీక్షలు

విశాలాంధ్ర-పొందూరు: మండలపరిధిలో మూడు పరీక్షాకేంద్రాలలో ఇంటర్ పరీక్షలు బుదవారం ప్రశాంతంగా జరిగాయి. మండలంలో 3 పరీక్షాకేంద్రాలలో 741 మంది విద్యా ర్థులు పరీక్షలు వ్రాయాల్సి ఉండగా 31 మంది గైర్హాజరయ్యారు. 710 మంది ఇంటర్ ప్రథమ సంవత్సర విద్యార్థులు పరీక్షలు రాసారు. పొందూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 297 మంది విద్యార్థులకుగాను 15 మంది గైర్హాజరుకాగా 282 మంది విద్యా రులు, సిస్టం కళాశాలలో 223 మంది విద్యార్థులకు 216 మంది విద్యార్థులు. కింతలి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 221 మంది విద్యార్థులకుగాను 212 మంది విద్యార్థులు పరీటలు వ్రాసార్లని పొందూరు కళాశాల ప్రిన్సిపాల్ రామ్ మనోహర్ తెలిపారు.

ఈ ఏడాది పంట పండిన కర్బూజా

విశాలాంధ్ర-జలుమూరు: మండలంలో పలు గ్రామాల్లో సాగు చేస్తున్న కర్బుజా పంట పండింది. వంశధార నది తీర గ్రామాల్లోని ఇసుక నేలల్లో కర్బూజా సాగు చేస్తున్నారు. జలుమూరు మండలంలోని అందవరం, పర్లాం, రామకృష్ణాపురం, మాకవరం తదితర గ్రామాలకు చెందిన రైతులు కర్బుజా సాగు చేశారు. ప్రస్తుతం పంట చేతికి అంది వచ్చింది. కాయ సైజు బాగుంటే అధిక ధరకు కొనుగోలు చేస్తున్నారని రైతులు చెబుతున్నారు. ఎకరానికి రూ.60 వేలు వరకు ఆదాయం వస్తుందని అన్నారు.

పరీక్ష కేంద్రాన్ని సబ్ కలెక్టర్ సందర్శన

విశాలాంధ్ర-టెక్కలి : ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం పరీక్ష కేంద్రాలను సబ్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి విశ్వ జ్యోతి జూనియర్ కాలేజ్, ఎస్వి ఆర్కే జూనియర్ కాలేజ్ లను బుధవారం సందర్శించారు. ఈ సంద ర్భంగా పరీక్ష కేంద్రంలోని మౌలిక సదుపాయా లను పరిశీలించారు. విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చూసుకోవలసిన బాధ్యత యాజమాన్యాలపై ఉందన్నారు. వీరితో పాటు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానం

విశాలాంధ్ర - ఎచ్చర్ల : ఎచ్చెర్ల లోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాల కళాశాలలో 2023 - 24 విద్యా సంవత్సరంలో ఐదో తరగతి ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశానికి ఈనెల 24వ తేదీలోగా ఆన్లైన్లో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ప్రిన్సిపాల్ జి పద్మజ తెలిపారు. ఐదో తరగతిలో 80 సీట్లు, ఇంటర్ ఎంపీసీ, బైపీసీ గ్రూపులో 40 సీట్లు వంతున ఉన్నాయన్నారు. ఐదో తరగతిలో ప్రవేశానికి ఏప్రిల్ 23న పరీక్ష నిర్వహిస్తామన్నారు.

అభివృద్ధికి ఆమడ దూరంలో పాతపట్నం షిరిడినగర్ వాసులు

విశాలాంధ్ర-పాతపట్నం: మేజర్ పంచాయతీ షిరిడి నగర్ వాసులు నానా పాట్లు పడుతున్నారు పంచాయతీకి 100 అడుగుల దూరంలో, మార్కెట్ కి 50 అడుగుల దూరంలో ఉన్న వీధికి రోడ్డుగాని, డ్రైన్‌గాని, డ్రింకింగ్ వాటర్‌గాని లేవు. ఈ వీధి ప్రజలు అభివృద్ధికి ఆమడ దూరములో ఉన్నారు. రహదారి బురదతో అధ్వానంగా ఉంది. కనీసం నడవలేని పరిస్థితి నెలకొంది. ఈ బురద రహదారి గుండా విద్యార్థులు, స్కూల్‌కి చేరుకోవ డానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ మార్గం గుండా వెళ్లే ద్విచక్ర వాహనాల నుండి కిందపడి ప్రమాదాలు జరిగిన ఘటనలున్నాయి. కనీసం ఇటువంటి సమయంలో అధికారులు, పాలకులు స్పందించి మురుగు నీరు నిల్వ ఉండిపోవడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నడిచి కూడా వెళ్లలేని ప రిస్థితి ఉందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. డ్రైనేజీలు లేక అందరి ఇళ్లనుండి వచ్చే నీరు రోడ్డు పై నిలిచి ఉండిపో వడంతో దోమలు, విష పురుగులు వ్యాప్తి చెందు తున్నాయని దుర్వాసన వస్తోందని చాలా మంది వీధి వాసులు చిన్నారులు విష జ్వోరాలకు బలై హాసుపత్రి పాలౌతున్నామని చెప్తున్నారు డ్రైనేజీలు లేక నీరు నిల్వ ఉండిపోయి రాకపోక లకు అంత రాయం ఏర్పడుతోందని తెలిపారు. రోడ్డు పక్కన పాదచారులు నడిచే సమయంలో టూవీలర్లు స్పీడుగా వస్తే మురుగు నీరు ఒంటిపై పడుతోంది. వీధుల్లో రోడ్లపై ఉన్న నీటిని డ్రైనేజీలు కట్టి నీటిని కాల్వలలోకి మళ్లించే ప్రయత్నం చేయడం లేదు ఎన్నాలకు చేస్తారో తెలియదు, నియోజక వర్గం ప్రధాన కేంద్రంలోనే ఇలావుంటే గ్రామాలలో పరిస్థితులు ఎలా ఉంటాయో చెప్పక్కర లేదు, అధికారులు గాని నాయకులు గాని పట్టించుకోరు ఎన్నికల టైమ్‌లో మాత్రం అరచేతిలో వైకుంఠం చూపిస్తారు, అన్ని పార్టీల నాయకులు, ప్రజలు ఇబ్బంది. పడుతున్నా పంచాయతీ అధికారులు పట్టించుకోవడం లేదని వీధి వాసులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. కనీసం ఎమ్మెల్యే అయినా మా మొర ఆలకించి మాకు న్యాయం చేయాలని వీధ ప్రజలు కోరుకుంటున్నారు.

శారీరక దారుఢ్యంతోనే సంపూర్ణ ఆరోగ్యం

ప్రముఖ వైద్యనిపుణులు దానేటి శ్రీధర్

విశాలాంధ్ర-శ్రీకాకుళం స్పోర్ట్స్/క్రైం: శారీరక దారుఢ్యంతోనే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని, ప్రతీ ఒక్కరూ వ్యాయామం చేయడం తప్పనిసరి అని ప్రముఖ వైద్యనిపుణులు దానేటి శ్రీధర్ అన్నారు. నగరంలోని మెడికవర్ ఆసుపత్రిలో బుధవారం రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాడీబిల్డింగ్ ఎంతో ఖర్చుతో కూడుకున్నదని, అటువంటి క్రీడలో రాణిస్తూ ముందుకు సాగుతుండడం అభినందనీయ మన్నారు. నేడు మారుతున్న ఆహారపు అలవాట్ల నేపథ్యంలో చిన్నవయసులోనే అనారోగ్యం బారిన పడుతున్నారని, వ్యాయామం చేయడం ద్వారా ఆరోగ్యంగా, ఫిట్ గా ఉంటారని చెప్పారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ బాడీబిల్డర్స్ అసోసి యేషన్ అసోసియేట్ సెక్రటరీ విజయ్ కుమార్ మాట్లాడుతూ ఈ నెల 19న 25వ మిస్టర్ ఆంధ్రా రాష్ట్రస్థాయి పోటీలు ఆర్ట్స్ కళాశాల వేదికగా నిర్వహిస్తున్నామని వివరించారు. ఈ పోటీలకు జిల్లా నుంచి 40 మంది క్రీడాకారులు పాల్గొంటు న్నారని, రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 300 మంది క్రీడాకారులు పోటీలకు వస్తున్నారని వివరించారు. వీరికి వసతి, భోజన సౌకర్యాలు అందించడంతో పాటు విజేతలకు నగదు ప్రోత్సాహక బహుమ తులు అందజేయడం జరుగుతుందని చెప్పారు. దానేటిని కలసిన వారిలో బాడీబిల్డర్లు నవీన్, రఫీ, శేఖర్, మదీనా, మధులతో పాటు అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు బి. ప్రసాద్, అసోసియేషన్ సభ్యులు మనోజ్‌కుమార్ మండల, టీమ్ మేనేజర్ కె. గౌరీ శంకర్ (ఆమదాలవలస) తదితరులు పాల్గొన్నారు.

బహుజన రాజ్యాధికార సాధన స్ఫూర్తి ప్రదాత 'కాన్షిరాం'

విశాలాంధ్ర-శ్రీకాకుళం రూరల్ : మహాత్మా జ్యోతి రావు పూలే, బాబా సాహెబ్ అంబేద్కర్‌ల భావజాలంతో వారి వారసుడుగా గొప్ప మానవతా వాది, దళిత-బహుజనులు హక్కులు సాధించు టకు, ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ కులాలను ఐక్యత చేసి బహుజన రాజ్యాధికారం కోసం కృషి చేసిన మహా మనిషి మాన్యశ్రీ కాన్షిరాం అని, జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు పిట్ట. చంద్రపతిరావు అన్నారు. కాన్షిరాం 89వ జయంతి కార్యక్రమం స్థానిక కలెక్టరేట్ రోడ్డులో గల మహాత్మా జ్యోతి రావు పూలే పార్క్ లో కాన్షిరాం విగ్రహం వద్ద జాతీయ బీసీ సంక్షేమ సంఘం నాయకులు, బహుజన నాయకులు ఆధ్వర్యంలో ఘనంగా జయంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రపతిరావు మాట్లాడుతూ రాజ్యాధికారం నకు రాని జాతులు అంతరించి పోతాయనే అనే అంబేద్కర్ నినాదాన్ని స్ఫూర్తిగా తీసుకొని బహుజన సమాజ్ పార్టీ ని స్థాపించి భారత దేశానికీ గుండె కాయలాంటి అతి పెద్ద రాష్ట్రం అయిన ఉత్తర ప్రదేశ్ కు దళిత వర్గంలో జన్మించిన కుమారి మాయావతి ని 4సార్లు ముఖ్యమంత్రిని చేసిన ఘనత కాన్షిరాం దేనన్నారు. బహుజన రాజ్యాధికారంతోనే ఈ దేశంలో సమ సమాజం ఏర్పడుతుందని ఆ దిశగా ఆ మహనీయుని రాజ్యాధికార సాధన స్ఫూర్తితో నేటి బహుజనులు పనిచేయడమే ఆ మహనీయునికి మనం ఇచ్చిన నిజమైన నివాళి అని నాయకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమం లో అల్ ఇండియా దళిత రైట్స్ ఫోరమ్ జిల్లా అధ్యక్షులు కంత వేణు, బీసీ, బహుజన నాయకులు కొన్న క్రిష్ణా రావు, అనంత రావు, గుణుపూరు నరసింగ రావు, బోడలా రాజారావు, లింగాల గరికివాడు, లాస సోమేశ్వర రావు, అర్జీ ఈశ్వర్, నక్క అప్పలరాజు. లండ అప్పన్న, తదితరులు పాల్గొన్నారు.

లబ్ధిదారులకు చేరని హుదూద్ తుఫాన్ ఇళ్లు

- భవనాల చుట్టూ పెరుగుతున్న జంగిల్...
- పట్టించుకోని అధికారులు

విశాలాంధ్ర-సంతబొమ్మాళి : సంతబొమ్మాళి పంచాయతీ లక్ష్మీపురం గ్రామం వద్ద నిర్మించిన హుదుద్ తుఫాన్ గృహాలు ఇంతవరకు లబ్ధిదారులకు చేరలేదు. హుదూద్ తుఫాన్ అనంతరం, తుఫాన్ లో నష్టపోయిన బాధితులకు ప్రభుత్వం గృహాలు నిర్మించి ఇచ్చేందుకు, కోట్లాది రూపాయలు వెచ్చించి సకాలంలో గృహాల సముదాయం నిర్మించారు. అయితే నిర్మాణం జరిగిన నాటి నుంచి లబ్ధిదారుల ఎంపికలో అధికారులు నిర్ణయించలేని పరిస్థితి ఎదుర్కొంటుంది. దీంతో ఏళ్ళు గడుస్తున్న లబ్ధిదారులకు ఇల్లు చెందకపోవడంతో ఆ సముదాయ ఇళ్ల భవనాలు చుట్టూ జంగిల్ పెరుగుతుంది. అలాగే ఈ భవనాల సముదాయానికి సౌకర్యంగా రహదారి నిర్మించారు. రహదారి సైతం జంగిల్తో నిండు ఉంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు లబ్ధిదారులకు గృహాలు ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని లబ్ధిదారులు కోరుతున్నారు.

సమాజంలో ప్రతి ఒక్కరూ వినియోగదారులే

- గ్రామీణ ప్రాంతాల్లో జరిగే మోసాలను అరికట్టాలి
- కమీషనర్ హనుమంతు అరుణ్ కుమార్

విశాలాంధ్ర-శ్రీకాకుళం : సమాజంలో ప్రతి ఒక్కరూ వినియోగదారులేనని, కావున ప్రతి వినియోగదారుడు తమ హక్కులు, బాధ్యతలను గుర్తెరగాలని పౌర సరఫరాల శాఖ కమీషనర్ హనుమంతు అరుణ్‌కుమార్ పిలుపునిచ్చారు. పౌర సరఫరాలు మరియు సంబంధిత శాఖల ఆధ్వర్యాన బుధవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి పౌర సరఫరాల శాఖ కమీషనర్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రతి వినియోగదారుడు తాము కొనుగోలు చేసిన వస్తువులకు బిల్లును తప్పనిసరిగా తీసుకోవాలని, కాని ఆ విధంగా చేయకపోవడంతో చాలామంది రైతులు, రోగులు, గ్యాస్, బ్యాంకు ఖాతాదారులు తదితర వినియోగదారులందరూ నష్టపోతున్నారని గుర్తుచేశారు. ఇందుకు వినియోగదారుల హక్కులపై సరైన అవగాహన లేకపోవడమేనని తేల్చిచెప్పారు. బిల్లు లేకపోతే వినియోగదారునికి ప్రశ్నించే హక్కు ఉండబోదన్నారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో జరిగే మోసాలను అరి కట్టేందుకు సరైన అవగాహన కల్పించాల్సిన ఆవశ్యకత ఉందని తెలిపారు. కావున ప్రతి ఒక్కరూ బిల్లు ప్రాధాన్యతను తెలుసుకోవాలని, దీన్ని మరో పదిమంది ఖచ్చితంగా ఆచరించేలా చూడాలని సూచించారు. కలెక్టర్ శ్రీకేశ్ లాఠకర్ మాట్లాడుతూ వినియోగదారులు మోసపోకుండా ఉండేందుకు అనేక స్వచ్ఛంధ సంస్థలు పనిచేస్తున్నా యన్నారు. అయినప్పటికీ పలుచోట్ల జరిగే మోసా లను అరి కట్టేందుకు సమాజంలో ప్రతి ఒక్కరికీ అవగాహన తప్పనిసరిని, ఇందుకు ఇటువంటి కార్యక్రమాలు దోహదపడతాయన్నారు. ఈ కార్యక్రమంలో వినియోగదారుల ఫోరం సభ్యులు బగాది రామ్మోహన్‌రావు, జి.రాధారాణి, షణ్ముఖ రావు, జిల్లా సరఫరాల అధికారి డి.వి.రమణ, పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ పి.జయంతి, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ పథక సంచాలకులు డా. డి.వి.విద్యాసాగర్, జిల్లా విద్యాశాఖాధికారి జి.పగడా లమ్మ, జిల్లా వైద్యఆరోగ్యశాఖాధికారి డా.బి.మీనాక్షి, సెట్ శ్రీముఖ్యకార్య నిర్వహణాధి కారి బి.వి.ప్రసాదరావు, ఇతర శాఖల అధికారులు, ఫోరం సభ్యులు, స్వచ్ఛంధ సంస్థలు తదితరులు పాల్గొన్నారు.

యోగ పీజీ డిప్లమో కోర్సులో ప్రవేశానికి దరఖాస్తులు గడువు పెంపు

విశాలాంధ్ర-ఎచ్చెర్ల : డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ యూనివర్సిటీలో యోగ పీజీ డిప్లమో కోర్సులో ప్రవేశానికి వచ్చేనెల మూడవ తేదీ వరకు దరఖాస్తుల సేకరణకు గడువు పెంచినట్లు వర్సిటీ రిజిస్టర్ ప్రొఫెసర్ సిహెచ్ రాజేంద్రప్రసాద్ తెలిపారు. ఈ కోర్సులో చేరేందుకు ఆసక్తిగల విద్యార్థులు డిగ్రీ ఉత్తీర్ణులై 10 వేల రూపాయల ట్యూషన్ ఫీజు చెల్లించాలన్నారు. వర్సిటీ వెబ్సైట్ నుంచి డౌన్లోడ్ చేసుకున్న దరఖాస్తుతో పాటు రెండు వందల రూపాయలు ఫీజును చెల్లించాలన్నారు. మరిన్ని వివరాల కోసం ఫోన్ నెంబర్లు 94906 7790, 72859 13769కు సంప్రదించాలన్నారు.

కౌంటింగ్ ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించాలి : జేసీ నవీన్

విశాలాంధ్ర-శ్రీకాకుళం : స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి నిర్వహించే కౌంటింగ్ ప్రక్రియలో ఎటువంటి పొరపాట్లు జరగకుండ సమర్థవంతంగా నిర్వహించాలని జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్ కౌంటింగ్ సిబ్బందిని ఆదేశించారు. బుధవారం పాలిటెక్నిక్ కళాశాలలో స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించిన కౌంటింగ్ సిబ్బందికి జరిగిన రెండవ విడత శిక్షణా కార్యక్రమంలో రిటర్నింగ్ అధికారి మరియు సంయుక్త కలెక్టర్ ఎం. నవీన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ భారత ఎన్నికల సంఘం నియమావళి పై రూపొందించిన మాన్యువల్ ను క్షుణ్ణంగా చదివి అర్థం చేసుకొని పూర్తి అవగాహనను ఏర్పరచుకోవాలని కౌంటింగ్ సిబ్బందికి సూచించారు. స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి జిల్లాలోని 4 పోలింగ్ కేంద్రాల ద్వారా ఈ నెల 13 వ తేదీ సోమవారం ఎన్నికలు నిర్వహించడం జరిగిందని ఇందుకు సంబంధించి స్ట్రాంగ్ రూమ్ ను పోలిటెక్నిక్ కళాశాలలో ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. కౌంటింగ్ కి సంబంధించి ప్రతి అభ్యర్థి ఒక కౌంటింగ్ ఏజెంట్ ని నియమించు కోవచ్చున్నారు. గార తహసీల్దార్ మాస్టర్ ట్రైని యస్.సుధాసాగర్ మాట్లాడుతూ శాసనమండలి ఓట్ల లెక్కింపు ప్రక్రియకు సంబంధించి మాక్ కౌంటింగ్ చేపట్టడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ డివిజినల్ అధికారి బి. శాంతి, డి.ఆర్.డి.ఎ ప్రాజెక్ట్ అధికారి విద్యాసాగర్, ఎన్నికల కౌంటింగ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

క్షయ రోగులు క్రమం తప్పకుండా మందులు వాడాలి

విశాలాంధ్ర-జలుమూరు : నోటి తుంపర్ల ద్వారా వ్యాపించే క్షయ వ్యాధి పట్ల క్షయ రోగులు, ప్రజలు జాగ్రత్తగా ఉండాలని టెక్కలిపాడు మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్ స్వాతి తెలిపారు. జలుమూరు మండలం ఈదులవలస గ్రామంలో బుధవారం క్షయవ్యాధి పట్ల నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో మాట్లాడారు. క్షయ నిర్ధారిత రోగులు మందులు క్రమం తప్పకుండా వేసుకోవాలని, సూచించారు. హెల్త్ అసిస్టెంట్ నాగేశ్వరరావు, తులసమ్మ, ఆదిలక్ష్మి పాల్గొన్నారు.

ఆంజనేయ స్వామి ఆలయం నిర్మాణానికి సన్నాహాలు

విశాలాంధ్ర-సంతబొమ్మాళి : ఈ మండలం హనుమంతునాయుడిపేట పంచాయితీలో ఉన్న టెంకపేట గ్రామంలో, ఆంజనేయస్వామి ఆలయం నిర్మాణం కోసం సన్నద్ధమయ్యారు. పంచాయతీ మాజీ సర్పంచ్ టెంకపేట గ్రామ పెద్ద అయిన కోళ్ళ భాస్కరరావు ఆధ్వర్యంలో ఆలయ నిర్మాణానికి సంబంధించిన స్థలాన్ని పరిశీలించి, ఆస్థలంలో ఉన్న జంగిల్‌ను తొలగించి ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ కోళ్ల భాస్కర్‌రావు మాట్లాడారు. ఆయనతోపాటు గ్రామ పెద్దలు, గ్రామస్తులు ఉన్నారు.

ఖాదీ పరిశ్రమకు పునర్జీవం కల్పించండి : జడ్పీటీసీ



విశాలాంధ్ర-సంతబొమ్మాళి : ఖాదీ పరిశ్రమకు పునర్జీవం కల్పించాలని సంతబొమ్మాళి మండలం జెడ్పిటిసి పాల వసంతరెడ్డి సంబంధించిన అధికారులను కలిసి కోరారు. జిల్లా పరిశ్రమ కేంద్రంలో గల ఖాదీ పరిశ్రమల కేంద్రం డైరెక్టర్ ప్రత్యేక ఉపాధి కల్పన అధికారులు, ప్రసాదరావుని కలిసి సంతబొమ్మాళి చేనేత సమస్యలని ఇక్కడ పరిస్థితులను వివరించారు. గ్రామీణ ప్రాంతాల్లో ఎంతోమందికి ఉపాధి కల్పించే ఖాదీ పరిశ్రమ పూర్తిగా నిర్లక్ష్యం గావించబడిందని, ప్రస్తుతం దీన్ని పునరుద్ధరించే దిశగా అధికారులు చర్యలు చేపట్టాలని అధికారులను కోరారు.

ఆరోగ్యకరమైన ఆహారం, అలవాట్లు అలవర్చుకోవాలి

విశాలాంధ్ర-సోంపేట : మండలం జింకిభద్ర గ్రామంలో గల ప్రభుత్వ పాఠశాలను కొర్లాం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు సౌజన్య సందర్శించారు. ఈసందర్భంగా విద్యార్థులకు ఆరోగ్య కరమైన అలవాట్లు, ఆహారపు అలవాట్లు కోసం సూచనలు అందించారు. ఆరోగ్యశాఖ తరపున మల్టీ పర్పస్ హెల్త్ వర్కర్స్ శిరీష, నాగమణి, నోములు, ఈశ్వరమ్మలతో పాటు ప్రధాన ఉపాధ్యాయులు వేణుగోపాల్ పాల్గొన్నారు. అనంతరం విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు.